తుర్కపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్డీఓ కృష్ణారెడ్డి

తుర్కపల్లి, జనవరి 15 : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం గ్రామాల్లో అధికారులు ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఈ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 16 నుంచి 20వరకు అధికారులు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పూర్తి వివరాలను సేకరించాలన్నారు. ఆ వివరాలను ఈనెల 21నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో తాసీల్దార్ దేశీయ, ఎంపీడీఓ జాన్సీ లక్ష్మీబాయి, ఏఓ శ్రీఉమ, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

దరఖాస్తుల పరిశీలన

వలిగొండ : ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డుల కోసం మండల ప్రజలు చేసుకున్న దరఖాస్తులను చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారి అంజనీదేవి, ఆర్ఐలు కరుణాకర్‌రెడ్డి, మనోహర్, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయశాఖ అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి : డీపీఓ

భూదాన్‌పోచంపల్లి, జనవరి 15 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా తగిన చర్యలు తీసుకోవాలని డీపీఓ, మండల స్పెషల్ ఆఫీసర్ సునంద అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అధికారులతో ఆమె సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీఓ మజీద్, ఏఓ శైలజ, ఏపీఓ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రాజాపేట : చల్లూరులో కురుమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్

రాజాపేట, జనవరి 15 : మండలంలోని చల్లూరు గ్రామంలో కురుమ సంఘం క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ బుధవారం అవిష్కరించారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ వంచ వీరారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుంటి కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్, మాజీ జడ్పీటీసీ జెల్ల భిక్షపతిగౌడ్, రేగు సిద్ధులు,చ గుంటి కృష్ణ, బుడిగె పెంటయ్యగౌడ్, ఇంజ నరేశ్, సుధాకర్ ఉన్నారు.

ఆలేరు రూరల్ : గౌడ ఐక్యసాధన సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండలంలోని కొలనుపాకలో గౌడసంఘం అధ్యక్షుడు మాసపేట రాజు గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొల విక్రం గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బైరిపాపరాజ, భిక్షపతి, ఆనందం, సోమయ్య, ఉప్పలయ్య, మల్లేశ్, నర్సింహులు, గణేశ్ పాల్గొన్నారు.

అధ్యయనోత్సవాలు పరిసమాప్తం

స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు

యాదగిరిగుట్ట, జనవరి 15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో ఈ నెల 10న ప్రారంభమైన అధ్యయనోత్సవాలు బుధవారం ముగిశాయి. స్వయంభు ప్రధానాలయంలో నిత్యారాధనల అనంతరం లక్ష్మీనరసింహస్వామిని అలంకరించి ఆళ్వారుల ఎదుట ప్రబంధ పారాయణాలను పఠించి, భక్తుల దర్శనార్థం తిరు వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులకు తిరుమంజన, నవకలశ స్నపనం ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు వైభవంగా జరిపారు. ఇరామానుజ నుత్తందారి ఉపదేశరత్తినమాలై అనుసంధానం చేసి అధ్యయనోత్సవాలకు పరిసమాప్తి పలికారు. ఉత్సవాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్భాల భాస్కర్‌శర్మ, ఆలయ అధికారులు రఘు, గజవెల్లి రమేశ్‌బాబు పాల్గొన్నారు.

లింగస్వామిని సన్మానిస్తున్న యువకులు, గ్రామస్తులు

లింగస్వామికి సన్మానం

రామన్నపేట, జనవరి 15 : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన వీరమళ్ల లింగస్వామి గౌడ్ ఎంఎస్సీ పీహెచ్‌డీ అనాటమీలో డాక్టరేట్ పొందినందుకు గాను గ్రామస్తులు, పదో తరగతి 1996-97 బ్యాచ్ మిత్రులు ఆయనను బుధవారం సన్మానించారు. లింగస్వామి గౌడ్ అనాటమీలో మోకాలి కీలు, దానిలో ఉన్న వివిధ లిగమెంట్స్ మెనిస్కస్‌లపై చేసిన పరిశోధనలపై డాక్టర్ డీవై పాటిల్ విద్యాపీఠ్ యునివర్సిటీ పూణె, మహారాష్ట్ర ఇటీవల గౌరవ డాక్టరేట్‌ను అందించింది. గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తేవడంతో సంక్రాంతి సందర్భంగా లింగస్వామికి జ్ఞాపికను అందజేశారు.

కార్యక్రమంలో గోలి స్వామి, కోణాల మధు, బలగోని కృష్ణ, గోపాల్, భూషణం, ఐలయ్య, ఎర్ర రమేశ్, నర్సింహ, లింగస్వామి, జగన్, సైదులు, వెంకటరమణ, నాగభూషణం, శ్రీశైలం, ఐలయ్య, రమేవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పథకాల్లో పట్టణ పేదలకు అవకాశం కల్పించాలి : సీపీఎం

మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు

మోత్కూరు, జనవరి15 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో పట్టణంలోని పేదలకు అవకాశం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. బుధవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 4 వేల కుటుంబాలు పేదరికంలో ఉన్నాయన్నారు. బుజిలాపురం, కొండగడప గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల ఆయా గ్రామాల్లోని పేదలకు ఈజీఎస్ పనులతో పాటు ఇప్పుడు అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలోనూ అవకాశం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పసునూరి చంద్రారెడ్డి, ప్రభాకర్, కురిమేటి యాదయ్య పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సంస్థాన్ నారాయణపురం, జనవరి 15 : మండలంలోని గుజ్జ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో 2002-2003వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు.

22 సంవత్సరాల తరువాత కలువడంతో విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

రైతు భరోసాను పటిష్టంగా అమలు చేయాలి

- కలెక్టర్ హనుమంతరావు

తాసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

మోటకొండూర్, జనవరి 15 : రైతు భరోసాను అర్హులకు మాత్రమే అందేలా చూడాలని, అనర్హులను గుర్తించి లిస్ట్ నుంచి తొలగించాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. బుధవారం మండల తాసీల్దార్ కార్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగుకు యోగ్యమైన భూములకు రైతు భరోసా వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల రికార్డులను పరిశీలించారు. పథకాల అమలులో ఎలాంటి అవకతవకలు జరగకూడదని, జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శాంతిలాల్, మండల వ్యవసాయాధికారిని రమాదేవి, డీటీ జయమ్మ, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్, సర్వేయర్ శివ, ఏఈఓ శివాణి, సంధ్య ఉన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

క్రీడలతో స్నేహ భావం

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, జనవరి 15 : క్రీడా పోటీల ద్వారా స్నేహ భావం పెరుగడంతో పాటు శారీరక ధృఢత్వం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్ఎన్‌పీఎల్ సిజన్ -2 వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు టోర్నమెంట్ స్పాన్సర్ శివరాత్రి విద్యాసాగర్‌తో కలిసి బుధవారం ఆయన బహుమతులు అందించి మాట్లాడారు. చిన్నకొండూరు గ్రామ జట్టు మొదటి బహుమతి, చండూరుకు రెండో, నారయణపురానికి మూడో బహుమతి దక్కింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్రి నరసింహ, గ్రామ శాఖ అధ్యక్షుడు లారీ భిక్షం,తెలంగాణ భిక్షం,చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, నాయకులు గడ్డం మురళీధర్ రెడ్డి, జక్కర్తి పాపయ్య, దొంటి జంగయ్య, గడ్డం పెంటయ్య, శ్రీను, నలపరాజు రమేశ్, చంద్రశేఖర్, గిరి బాబు పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : తాజ్‌పూర్‌లో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్

ఆత్మకూరు(ఎం)లో పిండి వంటలు చేస్తున్న మహిళలు

పల్లెల్లో ఘనంగా సంక్రాంతి

రాజాపేట, జనవరి 15 : మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా గాలి పటాలు ఎగుర వేశారు. రాజాపేటలో భాగ్యలక్ష్మి అనే మహిళ రామదాసు వేషధారణలో ఇంటింటికి వెళ్లి కానుకలు స్వీకరించారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతో పాటు కొరటికల్, మొరిపిరాల గ్రామాల్లోని యువజన సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, క్రీడోత్సవాలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

గ్రామాలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాండు

భువనగిరి కలెక్టరేట్ : సంస్కృతీ సంప్రదాయాలకు గ్రామాలు ప్రతీక అని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు అన్నారు. మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు 1వ, 2వ, 3వ బహుమతులు అందించి, పాల్గొన్న ప్రతి మహిళకు చీరను బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మరపు సురేశ్, ఉపసర్పంచ్ ర్యాకల సంతోశ్‌శ్రీనివాస్, వార్డుసభ్యులు పల్లెపాటి బాలమణి, గంజి సందీప్‌కుమార్, పండుగ కిరణ్, రాంపల్లి అరుణ్‌కుమార్, గ్రామస్తులు వరిగంటి రమేశ్ గౌడ్, బొమ్మరపు బాల్‌రాజు, ఎస్‌కే యాకూబ్, ఎస్‌కే హైమద్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

రాజాపేటలో రామదాసు వేషధారణలో కానుకలు స్వీకరిస్తున్న భాగ్యలక్ష్మి

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న సీపీఎం నాయకుడు శ్రీనివాస్

బీబీనగర్ : మండల పరిధిలోని జమీలపేట గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, యువకులకు స్లో సైకిల్, స్లో బైక్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పార్టీ మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని, ఇప్పటికే ఉన్న వాటికి బడ్జెట్ కేటాయించి నిర్వహణ చేయాలని కోరారు. కార్యక్రమంలో రేసు రామచంద్ర రెడ్డి, బండారు శ్రీరాములు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మంద కిరణ్ కుమార్, ఎరుకలు ఎల్లయ్య, ఎర్రనోళ్ల లక్ష్మయ్య పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని లక్ష్మణ్‌నగర్ కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బుధవారం మార్కండేశ్వర ఆలయ చైర్మన్ సీత సత్యనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గంజి బసవలింగం, భోగ విజయ్‌కుమార్, గుర్రం కృష్ణ, చక్రాల నరసింహ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కొండ శ్రీకాంత్ (ఫైల్)

భువనగిరికలెక్టరేట్, జనవరి 15 : ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన కొండ శ్రీకాంత్ (28) గత కొంత కాలంగా హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామమైన ఆత్మకూరు(ఎం)కు మంగళవారం ఉదయం వచ్చాడు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో తన ఆటోలో హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యంలో కూనూరు సమీపంలోకి రాగానే ఆటోను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అదే విధంగా పట్టణ పరిధిలోని రాయగిరిలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రూరల్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలు.. రాయగిరిలోని ఫ్లైవర్ బ్రిడ్జి సమీపంలో ఈనెల 10న గుర్తు తెలియని వ్యక్తి గాయపడి ఉండగా స్థానికులు 100కు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన వ్యక్తిని 108లో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి మతిస్థిమితం లేదని, రోడ్డుపై తిరుగుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ వి.సంతోశ్‌కుమార్ తెలిపారు.

యువత మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు : జహంగీర్

సభలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

రామన్నపేట, జనవరి 15 : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ సూచించారు. మండలంలోని మునిపంపుల గ్రామంలో డీవైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం ఆయన బహుమతులు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు ముత్యాలు, జితేందర్, నర్సింహ, ధనలక్ష్మి, హేమలత, సాయివర్ధన్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అబ్బాజ్‌బీ (ఫైల్)

భువనగిరికలెక్టరేట్, జనవరి 15 : పండుగ పూట మండలంలోని పలు గ్రామాల్లో విషాదం చోటు చేసుకున్నది. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, అనారోగ్యంతో ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్నది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన ఎస్‌కె.జిలానీ భార్య అబ్బాజ్‌బీ(30) కొంత కాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నది. మంగళవారం రాత్రి కూడా కడుపు నొప్పి రావడంతో తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ముగ్గురు ఆడపిల్లలున్నారు. మృతురాలి తండ్రి ఎండీ బాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ వి. సంతోశ్ కుమార్ తెలిపారు.

'యువతను ప్రోత్సహించేందుకే క్రీడలు'

ఆత్మకూరు(ఎం)లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఆత్మకూరు(ఎం), జనవరి15 : గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకే ప్రతి ఏడాది సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలో నేతాజీ యువజన సంఘాల ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంఘాల అధ్యక్షుడు ప్రతికంఠం శంతన్ రాజు, కార్యదర్శి ఎలిమినేటి మురళీకృష్ణ అన్నారు. మంగళ, బుధవారం నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో గ్రామ యువత ఉత్సాహంగా పాలొన్నారు.

గ్యాస్ లీకై పూరి గుడిసె దగ్ధం

రాజాపేట, జనవరి 15 : మండలంలోని కాల్వపల్లిలో ఇంజ నవీన్‌కు చెందిన పూరి గుడిసె గ్యాస్ లీకై బుధవారం దగ్ధమైంది. గుడిసెలో గృహోపకరణాలు, వస్తువులు, నగదు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పూరి గుడిసెను పరిశీలించి, బాధితుడికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గుట్టలో వీధి కుక్కల స్వైరవిహారం

యాదగిరిగుట్ట, జనవరి 15 : పట్టణంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ పట్టణవాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఏ కాలనీలో చూసినా గుంపులుగా దర్శనమిస్తూ కనబడిన వారి వెంట పడుతూ దాడికి పాల్పడుతున్నాయి. బీసీ కాలనీలో బుధవారం ఒక్కరోజే సుమారు ఐదు గురికిపై కుక్కలు దాడి చేశాయి. పట్టణానికి చెందిన నర్సింహ, మురళి అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉన్నా మున్సిపాలిటీ సిబ్బంది మాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

మఠంపల్లి, జనవరి 15:మట్టపల్లి గ్రామంలో గురువారం నుంచి తెలంగాణ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహించనున్నారు. నాలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు లీగ్‌లో పాల్గొననున్నారని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సోలార్ లైట్లు వితరణ

గరిడేపల్లి, జనవరి 15: సంక్రాంతి సందర్భంగా మండల పరిధి పరెడ్డిగూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులకు కందుల వీరనారాయణ, కస్తూరి దంపతులు బుధవారం సోలార్ లైట్లు వితరణ చేశారు. మొత్తం 62 కుటుంబాలకు రూ.96 వేల విలువైన సోలార్ లైట్లను అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ వైరు చోరీ

భువనగిరికలెక్టరేట్, జనవరి 15 : మండలంలోని ఎర్రంబల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైర్, ఆయిల్‌ను చోరీ చేసినట్లు రైతులు మొలుగు దశరథ, పెంటయ్య, చంద్రయ్య తెలిపారు. వారి వ్యవసాయ బావుల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మన్‌ను ధ్వంసం చేయడంతో విషయం తెలుసుకున్న రైతులు లైన్‌మెన్ నానంచర్ల నర్సింహకు ఫిర్యాదు చేయగా ఆయన రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

వలిగొండ, జనవరి 15 : మండలంలోని వర్కట్‌పల్లి గ్రామంలో ఉరి వేసుకొని బుధవారం యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మీసాల భిక్షపతి రెండో కుమారుడు తరుణ్‌కుమార్(22) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 15 : ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలు, భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, జగన్, లావుడియా రాజు, మంచాల మధు, వడ్డేపల్లి యాదగిరి, బుగ్గ లక్ష్మయ్య, పొన్నమోని కృష్ణ, రామస్వామి, అనిల్‌రెడ్డి, ఉప్పునూతల యాదగిరి, ముషం శివ, అలీమ్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి : ఎస్ఐ

రామన్నపేట, జనవరి 15 : గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఎస్ఐ పి.మల్లయ్య అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయడానికి సీసీ కెమెరాలను బుధవారం పోలీసులకు అందించారు. కార్యక్రమంలో యునియన్ అధ్యక్షుడు మోటె మల్లయ్య, ఉపాధ్యక్షుడు ఐలయ్య, కన్వీనర్ సంతోశ్‌రెడ్డి, సభ్యులు సత్తయ్య, యాదయ్య, లింగస్వామి, పరమేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయొద్దని ఎమ్మెల్యేకు వినతి

రామన్నపేట, జనవరి 15 : మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన అంబుజా సిమెంట్ పరిశ్రమను నెలకొల్పకుండా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బుధవారం అఖిలపక్ష నాయకులు ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని నకిరేకల్‌లో కలిసి వినతిపత్రం అందించారు. తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల్‌రూరల్, జనవరి15 : మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం రాత్రి నుంచి వాహనాల రద్దీ పెరిగింది. సంక్రాంతి పండుగ సెలవులు గురువారంతో ముగుస్తుండడంతో సొంత గ్రామాలకు వెళ్లిన ప్రజలు తిరిగి పట్నం బాట పడుతున్నారు. పంతంగి టోల్ ప్లాజా వద్ద ఉన్న మొత్తం 16 కౌంటర్లలో హైదరాబాద్ వైపునకు 12 కౌంటర్లు తెరిచి ఉంచారు. ఈ రద్దీ శుక్రవారం రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉందని జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

చింత బావి గ్రామంలో సర్వే చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 15 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్లు 1, 2 నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరం కొనసాగుతుంది. బుధవారం మండలంలోని చింత బావి గ్రామంలో మహిళా సాధికారతపై ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఎంతమంది చదువుకున్నారు, ఉద్యోగం చేస్తున్నారా, విద్యాభ్యాసం మధ్యలో ఆపేసిన వారు ఎంతమంది వంటి అంశాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు దుర్గం సాయివర్ధన్, వి జ్యోతి, విద్యార్థులు పాల్గొనారు.

ఆర్థిక సాయం

కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న గ్రామస్తులు

మోత్కూరు, జనవరి 15 : మండలంలోని రాగిబావి గ్రామానికి చెందిన నార్మాక్స్ ఉద్యోగి ఎలుగు రాంరెడ్డి ఇటీవల పాల శీతలీకరణ కేంద్రం ఆవరణలోని చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గాయపడ్డాడు. వెన్నుముఖకి తీవ్ర గాయం కావడంతో హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ